బ్యాంకు అధికారులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ సజ్జనార్

సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

● బ్యాంకు ఉద్యోగుల అవగాహన కార్యక్రమంలో సీపీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి బ్యాంకు ఉద్యోగి సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, బ్యాంకు ఉద్యోగులు తాము ప్రజల సొమ్ముకు రక్షకులమనే బాధ్యతను ఎట్టిపరిస్థితుల్లోనూ మర్చిపోవద్దని నగర సీపీ వీసీ సజ్జనార్ సూచించారు. శుక్రవారం రవీంద్రభారతిలో బ్యాంకు ఆఫ్ బరోడా ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉదోగులకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించేందుకు వివిధ భాషల్లో రూపొందించిన ప్రత్యేక బ్రోచర్‌ను బ్యాంకు అధికారులతో కలిసి సీపీ ప్రారంభించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్, సైబర్ క్రైం డీసీపీ అరవింద్ బాబు, బ్యాంకు ఆఫ్ బరోడా ఈడీ బీనా వహీద్, జోనల్ హెడ్ సుధాకర్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ విజేత పోలీస్ హంటర్స్ జట్టు

పోలీస్ హంటర్స్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న సైబరాబాద్ సీపీ రమేష్

హైదరాబాద్ సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన సైబరాబాద్ ప్రెస్, పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ లీగ్-2026 శుక్రవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ హంటర్స్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. సైబరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ హంటర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 224 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. 225 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన క్రైమ్ వారియర్స్ జట్టు పోలీస్ హంటర్స్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తట్టుకోలేక 73 పరుగులకే ఆలౌటైంది. దీంతో పోలీస్ హంటర్స్ జట్టు భారీ తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో 92 పరుగులు చేయడంతోపాటు 2 వికెట్లు పడగొట్టిన అద్వైత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. టోర్నమెంట్ మొత్తం 180 పరుగులు సాధించిన పోలీస్ హంటర్స్ ఆటగాడు నరేష్‌కు 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కింది. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత అవార్డులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, సైబర్ క్రైమ్స్ డీసీపీ సాయి మనోహర్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీలు, ఆర్ఐలు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నేచర్స్ లెగసీ ఫొటో ప్రదర్శన

ఫొటోగ్రఫీని తిలకిస్తున్న జయేష్ రంజన్ తదితరులు

హైదరాబాద్ సిటీ/హైటెక్ సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్, చార్టర్డ్ అకౌంటెంట్ హైమాకర్ వల్లూరి తన జీవితకాలంలో తీసిన అద్భుతమైన ఫొటోలతో ఓ ప్రదర్శనను మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ప్రారంభించారు. నేచర్స్ లెగసీ శీర్షికన మూడు రోజుల పాటు జరిగే ఈ ఫొటో ప్రదర్శనను స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వల్లూరి పనితనం ఫొటోగ్రఫీ అద్భుతాలకు మించినది, అది ఒక శక్తివంతమైన డాక్యుమెంటేషన్ అని ప్రశంసించారు. హైమాకర్ మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో తన కెమెరాలో బంధించిన ఆఫ్రికన్ సవన్నాలు, దక్షిణ అమెరికాలోని వర్షారణ్యాలు సహా అసాధారణ వాతావరణాలలో బంధించిన ప్రకృతి అందాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా హైదరాబాద్ రీజనల్ ఛైర్మన్ అనిల్‌కుమార్, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి అనూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు భూసేకరణ వేగిరం

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు సర్వీసు రోడ్డును నార్సింగిలోని ఎల్ఎస్ఆర్ రోటరీ నుంచి గ్రీడ్ రోడ్డులోని అలేఖ్య వరకు వెడల్పు చేసేందుకు నిర్ణయించగా.. భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సర్వీసు రోడ్డును వెడల్పు చేయడానికి ఔటర్ వెంట గల కిలోమీటర్ వరకు గల మార్గంలో దాదాపు 3.93ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని మంచిరేవుల గ్రామంలోని 491తో పాటు నార్సింగిలోని పలు సర్వే నెంబర్ల పరిధిలో గల స్థలాలను సేకరించనున్నారు. ఇందుకోసం 2013లో భూసేకరణ చట్టంలోని పలు నిబంధనలకు మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం సవరించిన భూసేకరణ చట్టం 2016 ప్రకారంగానే భూసేకరణ ప్రక్రియను చేపట్టనున్నారు. అదే తరహాలో షేక్‌పేట నాలా నుంచి మణికొండ, ఔటర్ మీదుగా శంకర్‌పల్లి రోడ్డులోని ఎంజీఐటీ వరకు గల పైపులైన్ వెంట గల రోడ్డును విస్తరించనున్నారు. ఈ రోడ్డు వెడల్పు చేసేందుకు 18.30ఎకరాలను సేకరించడానికి కూడా 2013లో భూసేకరణ చట్టంలోని పలు నిబంధనలకు మినహాయింపునిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించిన మోదీ సర్కార్

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దేశంలో చాలా కాలంగా పెండింగులో ఉన్న అనేక కీలక సమస్యలను గడిచిన 12 సంవత్సరాల్లో మోదీ సర్కార్ పరిష్కరించిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ సిక్‌విలేజీలోని గాయత్రీగార్డెన్‌లో శుక్రవారం సాయంత్రం 'మేధావులతో రాజ్‌నాథ్‌సింగ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పలు చట్టపరమైన, పరిపాలనా సంస్కరణలను అమలు చేశారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ సుశాసన్, వికాస్, జన్ కల్యాణ్ అనే మూడు అంశాలను కేంద్రంగా చేసుకుని గత పన్నెండు సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నదని వివరించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ జీఎస్‌టీ అమలు విషయంలో ఎవరూ ఊహించని రీతిలో మోదీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని, దేశాన్ని పురోగతి దిశగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీలు డి.కె.అరుణ, రఘునందన్‌రావు, నేతలు మర్రి జనార్ధన్‌రెడ్డి, మల్కా కొమరయ్య, ఏవీఎన్.రెడ్డి, అంజిరెడ్డి, రాకేష్‌రెడ్డి, వీరేందర్‌గౌడ్, భరత్‌గౌడ్, బాణుక నర్మద, భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌ను విలీనం చేయాలి: రవీందర్

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను తక్షణమే మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ తరపున నంకి రవీందర్ కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం, తెలంగాణ ప్రభుత్వం సమ్మతి తెలిపినప్పటికీ విలీన ప్రక్రియలో జాప్యం జరుగుతున్నదని ఆయన వివరించారు.

ఈఎస్ఐలో ఓపీ బ్లాక్‌ను త్వరలో ప్రారంభిస్తాం

● కేంద్ర మంతి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్ అర్బన్ ఆరోగ్య కేంద్రంలో బీపీ చెక్ చేయించుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అమీర్‌పేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో నిర్మించిన ఓపీ బ్లాక్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ఆస్పత్రిలో వెయ్యి కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అదనపు భవనాలు, హాస్టల్ వసతులు, బెడ్ల సంఖ్యను పెంచి ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని మరింత ఆధునికరించే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. నరేంద్రమోదీ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సనత్‌నగర్, అమీర్‌పేట అర్బన్ ఆరోగ్య కేంద్రాలకు పార్టీ ఆధ్వర్యంలో వివిధ రకాల ఆధునిక వైద్య పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని యూపీఎచ్‌సీలకు పరికరాలను అందజేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ రోజు వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు గుండె జబ్బుల నిర్ధారణ పరికల్ల పరికరాలు, కంటి పరికల్ల కోసం ఐ టెస్టింగ్ మిషన్ వంటి ఆధునిక వైద్య పరికరాలను అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సరళ, శ్రీశైలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత, సుస్థిర మైనింగ్‌కు ఆధునిక సాంకేతికత

● ఎంఈఏఐ జాతీయ సదస్సులో నిపుణులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మైనింగ్ రంగంలో భద్రత, సుస్థిరత, ఉత్పాదకత పెంపునకు ఆధునిక సాంకేతికతల వినియోగం అత్యవసరమని మైనింగ్ రంగ నిపుణులు పేర్కొన్నారు. మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఏఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'మైనింగ్ 4.0 - సురక్షిత, సుస్థిర మైనింగ్ కార్యకలాపాలకు అధునాతన సాంకేతికతలు' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎండీసీ

సదస్సులో పాల్గొన్న అతిథులు

సీఎండీ అమితావ ముఖర్జీ, ఎన్ఎండీసీ డైరెక్టర్ (టెక్నికల్), ఎంఈఏఐ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ వినయ్ కుమార్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), రోబోటిక్స్, ఆటోనమస్ సిస్టమ్స్, జియోస్పేషియల్ టెక్నాలజీలు, అధునాతన భద్రతా విశ్లేషణలు మైనింగ్ రంగ భవిష్యత్తును నిర్దేశిస్తున్నాయని తెలిపారు. ఎంఈఏఐ ఉపాధ్యక్షుడు, ఈఆర్ఎం గ్రూప్ సీఓఓ ధనంజయ రెడ్డి, ఎంఈఏఐ అధ్యక్షుడు, టాటా స్టీల్ కార్పొరేట్ వ్యవహారాల ఉపాధ్యక్షుడు డి.బి.సుందర రామన్, ఎన్ఎండీసీ డైరెక్టర్ (ప్రొడక్షన్) జాయ్‌దీప్ దాస్‌గుప్తా తమ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా మైనింగ్ రంగానికి విశేష సేవలందించిన అక్షయ దత్ త్రిపాఠి, ఎస్.కృష్ణమూర్తి, డా.కె.వి.శంకర్, డా.కె.శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు.

ప్రియుడి తల్లిదండ్రులు బెదిరించడంతోనే

బాలిక ఆత్మహత్య

● ప్రేమించిన యువకుడు, తండ్రి అరెస్ట్

చార్మినార్ డీసీపీ ఖారే కిరణ్ ప్రభాకర్‌ను కలిసిన బాధిత కుటుంబ సభ్యులు.

సైదాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో ప్రియుడి తల్లిదండ్రులు బెదిరించడంతోనే సైదాబాద్ సింగరేణి కాలనీలో బాలిక(17) ఉరేసుకుని చనిపోయిందని దర్యాప్తులో తేలిందని చార్మినార్ జోన్ డీసీపీ ఖారే కిరణ్ ప్రభాకర్ తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. మే 28వ తేదీ ఉదయం సింగరేణి కాలనీ రోడ్ నెం.7 హనుమాన్ దేవాలయం సమీపంలో నివాసం ఉండే అమూల్య శ్రీ(17) తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై మృతురాలి బాబాయి ఆమ్లోత్ చందర్ నాయక్(42) అదే రోజు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో అమూల్య శ్రీ, మేగావత్ నారాయణతో ప్రేమలో ఉన్నట్లు తేలింది. మహేష్ తల్లిదండ్రులు మేగావత్ వాల్ సింగ్, సుజాత బాలికను పిలిచి తమ కుమారుడిని కలవొద్దని, మాట్లాడొద్దని తీవ్రంగా బెదిరించారు. ఈ అవమానం, మానసిక వేదన తట్టుకోలేక అమూల్య ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితులు మేగావత్ నారాయణ, మేగావత్ వాల్ సింగ్‌లను మే 30న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మేగావత్ సుజాతతోపాటు మరికొందరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న మేగావత్ సుజాత కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

భూకబ్జాను అడ్డుకున్న అధికారులపై

పెట్రోల్ చల్లి, తానూ పోసుకొని..

● బీఆర్ఎస్ నాయకుడి హల్‌చల్

పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న ఫిరోజ్

జీడిమెట్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): భూకబ్జాను అడ్డుకోవడానికి వెళ్లిన రెవెన్యూ అధికారులపై కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ నాయకుడు ఫిరోజ్ పెట్రోల్ చల్లి తానూ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడని జీడిమెట్ల పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ గడ్డం మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... బీఆర్ఎస్ నాయకుడు ఫిరోజ్ కొంతకాలంగా కుత్బుల్లాపూర్ మండలం సర్వే నెంబర్ 79లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా కెమెరాలు ఏర్పాటు చేసుకుని, ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నాడు. బీజేపీ నాయకుడు జైశంకర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు గురువారం సర్వేనెంబర్ 79లోని ప్రభుత్వ భూమిని పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులు వెళ్లారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారుల విధులను అటంక పరుస్తూ ఫిరోజ్ అధికారులపై పెట్రోల్ చల్లి, తానూ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాకు రక్షణ కల్పించండి

ఫిరోజ్‌తో నాకు ప్రాణహాని ఉందని.. రక్షణ కల్పించాలని బీజేపీ నాయకుడు జైశంకర్‌గౌడ్ పోలీసులను కోరారు. కోట్ల రూపాయాల ప్రభుత్వ భూములు కబ్జాచేసిన ఫిరోజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రెవెన్యూ అధికారులను కోరారు.

ఉప్పల్ స్కైవాక్ లిఫ్ట్‌లో చిక్కుకున్న యువకుడు

● రెండు గంటలు లిఫ్ట్‌లోనే..

ఉప్పల్ స్కైవాక్ లిఫ్ట్‌లో చిక్కుకున్న రాహుల్

ఉప్పల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ స్కైవాక్ లిఫ్ట్‌లో ఓ యువకుడు చిక్కుకున్న ఘటన గురువారం రాత్రి తీవ్ర ఆందోళనకు దారితీసింది. మహబూబ్‌నగర్‌కు చెందిన రాహుల్ (20) ఉప్పల్‌లోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ ఎన్ఆర్‌పీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. పని ముగించుకుని హాస్టల్‌కు వెళ్తున్న సమయంలో ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి బయటకు వచ్చి రాత్రి సుమారు 11 గంటలకు 6-బీ స్కైవాక్ లిఫ్ట్ ఎక్కి కిందకు దిగుతుండగా లిఫ్ట్ ఆగిపోయింది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లిఫ్ట్ తలుపులు తెరుచుకోకపోవడంతో యువకుడిని బయటకు తీసేందుకు ఆలస్యమైంది. టెక్నీషియన్స్ దాదాపు రెండు గంటల పాటు శ్రమించి రాత్రి 1:15 గంటల సమయంలో లిఫ్ట్‌లో ఉన్న రాహుల్‌ను సురక్షితంగా బయటకు తీశారు. లిఫ్ట్ నుంచి బయటకు వచ్చిన రాహుల్ మాట్లాడుతూ.. 'నేను హార్ట్ పేషెంట్‌ను. లిఫ్ట్‌లో రెండుగంటలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాను. నిర్వహణ సంస్థ నుంచి సరైన సమయంలో స్పందన రాకపోవడంతో ఆలస్యం జరిగింది' అని ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలోనూ స్కైవాక్ లిఫ్ట్‌లలో ఇలాంటి సమస్యలు తలెత్తినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి రూ.80లక్షల పరిహారం

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మదన్‌గౌడ్

షాపూర్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బొంతపల్లి పారిశ్రామికవాడలోని మైత్రి డ్రగ్స్ టెక్నాలజీ సెంటర్‌లో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి రూ. 80లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించింది. మైత్రి డ్రగ్స్ టెక్నాలజీ సెంటర్‌లో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కసాల గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్(25) నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ నేపథ్యంలో శ్రమశక్తి అవార్డు గ్రహీత, రాష్ట్ర కార్మిక నాయకులు ముద్దాపురం మదన్‌గౌడ్ పరిశ్రమ యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. మృతుని కుటుంబానికి రూ.80 లక్షల నష్టపరిహారం, ప్రవీణ్ చెల్లెలు మౌనికకు కంపెనీలో ఉద్యోగం ఇచ్చేందుకు, ఉద్యోగానికి సంబంధించిన ఇతర ప్రయోజనాలను అందించేందుకు యాజమాన్యం అంగీకరించిందని మదన్‌గౌడ్ తెలిపారు.

రెడీమేడ్ వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

రాంనగర్/ముషీరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ మేడిబావి బస్తీలోని రెడీమేడ్ వస్త్ర దుకాణంలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించి వస్త్రాలు, యంత్రాలు దగ్ధమయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అడిక్‌మెట్ డివిజన్ మేడిబావి బస్తీలో రెడీమేడ్ వస్త్ర దుకాణాన్ని కౌడ ప్రశాంత్ నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణంలో ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేసి రెడీమెంట్ వస్త్రాలను స్టిచ్చింగ్ చేసి విక్రయిస్తున్నారు. గురువారం రాత్రి రోజూ మాదిరిగానే దుకాణం మూసి ఇంటికి వెళ్లారు. శుక్రవారం తెల్లవారుజాము 4గంటల సమయంలో షార్టుసర్క్యూట్‌తో దుకాణంలో మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు వెంటనే షెట్టర్ తెరిచి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే షాపులోని వస్త్రాలు, స్టిచ్చింగ్ యంత్రాలు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.10లక్షల ఆస్తినష్టం జరిగిందని షాపు యజమాని ప్రశాంత్ తెలిపారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని బాధితుడికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ అడిక్‌మెంట్ డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఫ్లెక్సీ కడుతూ కిందపడిపోయి గాయాలపాలైన భూక్యా మిట్య

రాజేంద్రనగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కిస్మత్‌పూర్ దర్గా ఖలీజ్‌కాన్‌లో శుక్రవారం జరిగింది. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన భూక్యా మిట్య(54) కిస్మత్‌పూర్ మ్యాజిస్టిక్ అపార్ట్‌మెంట్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. అదే అపార్ట్‌మెంట్‌లో దర్గా ఖలీజ్‌కాన్‌కు చెందిన గొల్లపల్లి శ్రీనివాస్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ఫ్లెక్సీ బోర్డును కిస్మత్‌పూర్ రహదారిపై ఇద్దరు కలిసి ఓ భారీ నిచ్చెన సహాయంతో ఏర్పాటు చేస్తున్నారు. నిచ్చెన 11కేవీ విద్యుత్ తీగెలకు తగిలింది. దీంతో భూక్యా మిట్యకు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. స్థానికులు తీవ్ర గాయాలకు గురైన భూక్యా మిట్యను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్ స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఎస్ఐ రాఘవేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాన్సీ నెంబర్లకు 60 రోజులు..!

● నిబంధనలు సవరించిన రవాణా శాఖ

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వాహనాలకు ఫ్యాన్సీ నెంబర్ల విషయంలో రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) జరిగిన 60 రోజుల్లోగా అందుబాటులో ఉన్న ఫ్యాన్సీ, ప్రత్యేక నెంబర్లలో నచ్చిన దానిని తప్పనిసరిగా రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు నిబంధనలను సవరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం టీఆర్ పూర్తయిన అనంతరం నచ్చిన నంబర్ కోసం కొందరు వాహనదారులు సుదీర్ఘకాలం నిరీక్షిస్తున్నారు. టీఆర్ గడువు నెల రోజులు ఉండగా.. మూడు నుంచి ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం పాటు తమ వాహనాలకు శాశ్వత రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు. ఇది నిబంధనలకు విరుద్ధమని, ఈ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని రవాణా శాఖ అదనపు కమిషనర్ రమేశ్ చిదుర తెలిపారు. నిర్ణీత 60 రోజుల్లోగా ఫ్యాన్సీ నెంబర్‌ను ఎంచుకొని రిజిస్ట్రేషన్ చేసుకోలేని పక్షంలో వాహన్ పోర్టల్ ఆటోమేటిక్‌గా ఆ వాహనానికి సాధారణ రిజిస్ట్రేషన్ నెంబర్ కేటాయిస్తుందని పేర్కొన్నారు. టీఆర్ గడువు 30 రోజులు అయినప్పటికీ.. మరో 30 రోజులు గ్రేస్ పీరియడ్‌గా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఫ్యాన్సీ నెంబర్లకు ఆన్‌లైన్ వేలంలో డిమాండ్ పెరగడంతో పాటు.. సంస్థకూ ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఖమ్మం అత్యాచార బాధితురాలికి

ఈటల పరామర్శ

మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో అత్యాచారం, హత్యాయత్నానికి గురై తీవ్ర గాయాలతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాలో ఈటల రాజేందర్ మాట్లాడారు. ఈ సంఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, ఇలాంటివి పునరావృతం కాకుండా దుర్మార్గాన్ని కఠినంగా శిక్షించాలన్నారు. ఆ బాలికకు చాలా గాయాలు అయ్యాయి. వెన్నుపూస కూడా విరిగిందన్నారు. ఆ అమ్మాయికి రక్షణ కల్పించాలని, ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని ఆయన సూచించారు.

FOR SALE ఆంధ్రజ్యోతి Daily JOBS
CLASSIFIEDS

JOBS

★ Urgent ఇంటీరియర్స్ మాడ్యులర్ ఫ్యాక్టరీలో పనిచేయుటకు క్రింది సిబ్బంది కావలెను. ప్రొడక్షన్ మేనేజర్, బీమ్ సా ఆపరేటర్, ఎడ్జ్ బ్యాండింగ్ ఆపరేటర్, CNC / బోరింగ్ ఆపరేటర్ 2-3